జాతీయ తైక్వాండో పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. చెన్నైలో మార్చి 24 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట, నందంపూడిలకు చెందిన పి.భార్గవి, శ్రీకర, కె.వైష్ణవి పాల్గొంటారని తెలిపారు. ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి 38 సీనియర్స్ తైక్వాండో పోటీల్లో పి.భార్గవి, శ్రీకర, కె.వైష్ణవి ప్రథమ స్థానంలో, కొయిలాగి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పోలాట్ కె.శ్రీధర్మశాస్త్రి, డిఎస్‌డిఒ శ్రీనివాస్, ఎపి తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుతరెడ్డి, బి.అర్జునరావు నుంచి మెడల్స్‌ను అందుకున్నారు. ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు బూడిద వరలక్ష్మి, హెచ్ఎం బి.హనుమంతరావు, ఉపాధ్యాయులు తదితరులు వారిని అభినందించారు.

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కలెక్టర్ హిమాన్షుశుక్లా

ప్రజాశక్తి - అమలాపురం

మార్చి 13న నిర్వహించనున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా కోరారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంఎల్‌సి ఎన్నిక విధివిధానాలను ఆయన వివరించారు. ఈనెల 16 నుంచి 23 వరకు నామి నేషన్లు స్వీకరిస్తారన్నారు. ఉమ్మడి జిల్లా తరుపున కాకినాడ జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వీటిని స్వీకరిస్తారని తెలిపారు. ఈనెల 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియలు ఉంటాయన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 16న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మార్చి 21తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం డివిజన్‌లో జడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు కలిపి 257 మంది ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. కొత్తపేట ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ సచివాలయం-4లో 159 మంది, రామచంద్రపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 154 మంది ఓటు హక్కును వినియోగించు కోవాల్సి ఉంటుందన్నారు జిల్లా వ్యాప్తంగా మొత్తం 570 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,436 మందికి ఓటుహక్కు ఉందన్నారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు, అమలాపురం టౌన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఒంటెద్దు బాబి, కొత్తపేట కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ముసిని రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

స్పందనలో వినతిపత్రం ఇచ్చేందుకు సిపిఎం, కెవిపిఎస్ నాయకులతో వచ్చిన రెల్లి కుటుంబాలు

ఆదుకోవాలి రెల్లి కుటుంబాల వినతి

ప్రజాశక్తి - అమలాపురం

ఐ.పోలవరం మండలం మురమళ్లలోని పుష్కరాల రేవు వద్ద దుర్భర జీవనాన్ని వెళ్లదీస్తున్న రెల్లి కుటుంబాలను ఆదుకోవాలని కెవిపిఎస్, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో రెల్లి కులస్తులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పచ్చిమాల వసంతకుమార్, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. 1986 నుంచి మురమళ్ల గ్రామ పంచాయతీలో రెల్లి కులస్తులు పనిచేస్తున్నాయన్నారు. ఇటీవల ఆరు నెలలుగా రేషన్ అందించడం లేదని తుపాకుల మాణిక్యాలమ్మ ఆవేదన చెందిన విషయం ప్రతికల్లో వచ్చిందన్నారు. దీంతో వారి సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం బృందం రెల్లి కాలనీలో పర్యటించిందన్నారు. కనీసం వారు ఉండేందుకు కూడా సరైన గూడు లేదని వారు తెలిపారు. దీంతో బంగారు ధనలక్ష్మి, కాకి తలుపులమ్మ నిమ్మకాయల మహాలక్ష్మి, తుపాకుల మాణిక్యాలమ్మ కుటుంబాలు కెవిపిఎస్, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారన్నారు. తక్షణం వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నివాస నీడలేక పిల్లలతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాణిక్యాలమ్మకు ఆరునెలలుగా రేషన్ అందడం లేదని, అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేని వియాన్ని కూడా గ్రీవెన్స్‌లో తెలిపామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థిది ప్రభుత్వ హత్యే...

టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి మాథూర్

ప్రజాశక్తి - అమలాపురం

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాల విద్యార్థి రాజ్‌వర్ధన్‌ది ప్రభుత్వ హత్యేనని టిడిపి అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జిఎం.హరీష్‌మాథూర్ అన్నారు. ప్రభుత్వ అసమర్థతతో ప్రాణం కోల్పోయిన విద్యార్థి కుటుంబాన్ని బెదిరించి పోలీసులు తప్పుడు స్టేట్‌మెంట్ ఇప్పించి సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. దీనిపై న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌కు వినతిపత్రం పంపామన్నారు. వసతిగృహంలో సమస్యలు నెలకొన్నాయన్నారు. సరైన భోజనం, తాగునీరు ఉండట్లేదన్నారు. తన తండ్రి గురుకుల హాస్టల్‌కి పంపించేస్తారనే భయంతోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని హరీష్ అన్నారు. వసతిగృహంలో సౌకర్యాలు లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. చదువుపై శ్రద్ధ చూపించలేక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. స్థానిక మంత్రి విశ్వరూప్ సైతం గతంలో వసతిగృహాన్ని పరిశీలించి లోటు పాట్లను గుర్తించారన్నారు. రూ.కోటితో అభివృద్ధి చేస్తామని ప్రకటించమే గోడి గురుకుల వసతిగృహం దుస్థితికి అద్దం పడుతుందన్నారు. ముడున్నరేళ్లుగా వసతిగృహాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడం తప్ప చేసింది లేదన్నారు. నేడు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తీసుకొచ్చారని హరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ చింతా అనురాధ సైతం ఇలాగాలోనే ఇలా జరగడం పాలనా రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని, వారి తరుపున ఎటువంటి పోరాటానికైనా సిద్ధం అవుతామన్నారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, మంతెన అశోక్, సూర్య భాస్కరరాజు, బోణం సూర్యనారాయణ, బడుగు పుల్లారావు, ఇసుకపట్ల చక్రవర్తి , జేమ్స్, నల్లి వెంకటరెడ్డి, బండారు ఏసు, కాశి శ్రీనివాసరావు, సుధీర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న హరీష్‌మాథూర్

విద్యార్థి మృతిపై విచారణ జరపాలన వినతి

అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి మోర్త రాజవర్ధన్ మృతిపై సమగ్ర విచారణ జరపి చర్యలు తీసుకోవాలని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ, ప్రజాసంఘాల నాయకులు సోమవారం స్పందన జిల్లా అధికారి సవ్యవాణికి కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురుకులంలో దుర్భరమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. విద్యార్థులకు తాగునీరు నాణ్యమైన ఆహారం, విద్య అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అనారోగ్యంతో ఇంటికి వెళ్లి పాఠశాలలో ఉన్నటువంటి పరిస్థితులకు భయపడి ఆత్మహత్య చేసుకున్న ఆరో తరగతి విద్యార్థి రాజ వర్ధన్ మతిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. దశాబ్ద కాలంగా గురుకులంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోట హనుమంతరావు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ నాయకులు

జ్వరాల విజృంభణ వార్తలపై ఆందోళన చెందొద్దు...

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని మాచరలో జ్వరాలు ప్రబలుతున్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని వాకతిప్ప పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రాకేష్‌చౌదరి అన్నారు. సోమవారం మాచరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చినట్లుగా గ్రామంలో వందల సంఖ్యలో జ్వరాలు విజృంభిస్తున్నాయని, డెంగీతో మహిళ మృతి చెందిందని అంటూ వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే చేయించామని, ఐదుగురు మాత్రమే జరంతో బాధపడుతున్నారన్నారు. వైద్య పరీక్షలకు చేయించగా టైఫాయిడ్ నిర్ధారణ అయిందన్నారు. వీరిలో ఇద్దరికి డెంగీ అనుమానత లక్షణాలు ఉన్నాయని, వారికి వైద్య పరీక్షలు చేయించి, మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సాధారణ చర్యల్లో భాగంగా గ్రామంలో చెత్తను తొలగించి డ్రెయినేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించామన్నారు. ముందస్తు చర్యగా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ సూర్యారావు గ్రామంలో పర్యటించి శానిటేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామ కార్యదర్శి చిన్న బాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఉపసర్పంచ్ అడపా వేణుబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం కోసం వినతి

ప్రజాశక్తి-రాజోలు

అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని తెలుగునాడు అంగనవాడీ డ్వాక్రా సాధికారిక పార్లమెంటరీ అధ్యక్షురాలు మోకా పార్వతీ డిమాండ్ చేశారు. సోమవారం రాజోలు ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒకు ఆమె వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీలు సేవలు అందిస్తున్నారన్నారు. 2017 నుంచి వారిక టిఎ బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. అంగన్‌వాడీలకు ఏడేళ్లుగా వేతన పెంపు లేదన్నారు. పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనం పెంచుతానని జగన్ హామీ ఇచ్చినా ఆచరణలో అమలు చేయలేదని విమర్శించారు. ఫేస్ హాజరు నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1ను వెంటనే రద్దుచేయాలని, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, రిటైర్మెట్ బెనిఫిట్లను రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ ప్రమోషన్ వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్ల ప్రక్రియలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.నాగవేణి, సిహెచ్.నాగలక్ష్మి, టి.కీర్తన పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలు నాణ్యతతో పూర్తి స్థాయిలో చూపాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 188 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు కలెక్టర్‌తో పాటు స్పందనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అర్జీలను నిశితంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపాలన్నారు. గడువు దాటిన అర్జీలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, ఐసిడిఎస్ పీడీ జివి.సత్యవాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఇలు కృష్ణారెడ్డి, చంటిబాబు, సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ ఎడి విశాలాక్షి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఆక్వా అక్రమ చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

కాట్రేనికోన : మండలంలోని కందికుప్ప పంచాయతీ శివారు గాజింగతిప్ప ప్రాంతాల్లో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని చిన్న, సన్నకారు వ్యవసాయ రైతు నాయకులు గాలిదేవర సూరిబాబు జిల్లా స్థాయి స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ చెరువుల తవ్వకాల వల్ల 20 మంది చిన్న రైతులు ఇబ్బందులు పడతామని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. 10 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నారని తెలిపారు. వీటి వల్ల చెరువుల ఆయకట్టు కింద ఉన్న వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని అధికారులను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సత్యనారాయణ,స్వామి,గోవిందు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కామనగరువులో 'వైఎస్ఆర్ కంటి వెలుగు'

అమలాపురం రూరల్ : అమలాపురం రూరల్ మండలం కామనగరువు సచివాలయం-1 వద్ద సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షతన సోమవారం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరం అయిన వారికీ ఉచితంగా ఆపరేషన్ చేస్తారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజలపూడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, కంటి వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

దుస్తులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు

సమాజ సేవలో లయన్స్ ముందంజ

ప్రజాశక్తి మండపేట

సమాజ సేవలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండు తాతరాజు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమానందిని మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం తాతరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలే ధ్యేయంగా లయన్స్ క్లబ్ పని చేస్తుందన్నారు. లయన్ జొన్నల వెంకటేశ్వరరావు సహకారంతో ఈ సేవ కార్యక్రమం చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్మా అక్తర్, లయన్స్ క్లబ్ సభ్యులు చెన్నా రాంబాబు, నాగేంద్రబాబు, కురసాల సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

ఈనెల 16న మండలంలోని గుమ్మిలేరులో జరిగే రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగుల పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను సర్పంచ్ గుణ్ణం రాంబాబు సోమవారం పరిశీలించారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాక్, పోటీలకు తరలివచ్చే రైతులకు సదుపాయాల కల్పన వంటి ఏర్పాట్లను సర్పంచ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంఎల్ఎ వేగుళ్లకు మాజీ మంత్రి గొల్లపల్లి పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

ప్రమాదవశాత్తు జారిపడి స్వల్ప గాయమై ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తదితరులు సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సూర్యనారాయణ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - మండపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమద్ధి యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పోస్టల్ ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ చేసిన కృషి అభినందనీయమని పలువురు పోస్టల్ ఉద్యోగులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఉద్యోగులంతా కలిసి సూర్యనారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగి కెవి నారాయణరావు మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్‌లో మండపేట పోస్టల్ కార్యాలయం అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ ఉద్యోగుల నాయకుడు టి.పుల్లేశ్వరరావు, ఉద్యోగులు షరీఫ్, కె.ఈశ్వరరావు, వి.గోవింద్, కె.జానకి, శ్రీనివాస్, దుర్గాభవాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోన మెయిన్ సెంటర్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీడ కార్యకర్త చిట్టూరి కనక మహాలక్ష్మి(54) సోమవారం మృతి చెందారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం పలు సర్వేలను అంగన్‌వాడీలు, సచివాలయం సిబ్బందితో నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 11న మహిళా పోలీస్, ఆర్‌సిహెచ్ నెంబర్ సర్వేను మహాలక్ష్మికి అప్పగించారు. సర్వే చేస్తుండగా ఆమె కళ్లు తిరిగి పడిపోయింది. ఆమె తలకి బలమైన గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించి బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయినట్టు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు. అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించడగా పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. అధికారుల పని ఒత్తిడి కారణంగానే మహలక్ష్మీ చని పోయిందని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన మహాలక్ష్మి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముమ్మిడివరం ప్రాజెక్ట్ కార్యదర్శి వెంకటలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు విపర్తి మోహన్‌రావు, విత్తనాల రాంబాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు మౌనిక ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన మీసాల మౌనిక జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ అండర్ -14 బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరుపున మౌనిక పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. దీంతో ఆమె రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరిగే జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిథ్యం వహించనుంది. ప్రస్తుతం మౌనిక అమలాపురంలోని శ్రీచైతన టెక్నో స్కూల్లో చదువుతోంది. బాస్కెట్‌బాల్‌లో ఆసక్తిని గమనించిన మౌనిక తల్లిదండ్రులు మీసాల రాజు, వెంకటలక్ష్మి చిన్నప్పటి నుంచి ఆమె ప్రోత్సహించారు. జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన మీసాల మౌనికను డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, పీడీ ఆర్.ప్రసాద్ తదితరులు అభినందించారు. నూజివీడులో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

వికలాంగురాలికి రేషన్ కార్డు మంజూరు

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన వికలాంగురాలు పితాని సత్యమహాలక్ష్మికి రేషన్‌కార్డును అధికారులు మంజూరు చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా ఆమె రేషన్ కార్డులో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఇద్దరు సచివాలయ ఉద్యోగుల పేర్లు నమోదయ్యాయి. దీంతో 2022 ఆగస్టు నుంచి రేషన్‌కార్డు, పింఛను నిలిచిపోయాయి. దీంతో ఆమె గతేడాది డిసెంబర్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ సత్వరమే స్పందించి ఉన్నతాధికారులతో స్వయంగా మాటాడారు. 2022 డిసెంబర్ నెల నుంచి పింఛను తిరిగి మంజూరయేయలా చర్యలు తీసుకున్నారు. రేషన్ కార్డును తిరిగి మంజూరు చేసేందుకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పౌర సరఫరాల సిబ్బంది సోమవారం ఆమె ఇంటికి వెళ్లి ఇకెవైసి నమోదు చేసుకున్నారు. అనంతరం రేషన్ కార్డు మంజూరు చేశారని జిల్లా పౌర సరఫరాల అధికారి పాపారావు తెలిపారు.

కార్డును అందిస్తున్న అధికారులు, సచివాలయం ఉద్యోగులు

కార్టూ'నిజం'

ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు పూర్తిగా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో జిల్లా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశం డిఆర్ఒ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ ఎన్విరాన్మెంటల్ అనే సబ్జెక్టులపై 112 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మార్చి 15 నుంచి మార్చి 29 వరకు థియరీ పరీక్షలకు 38 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 28,973 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణ అంతా సిసి కెమెరాలు నిఘాలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా పరీక్షల కమిటీలో ముగ్గురు ప్రిన్సిపాల్స్‌లను నియమించామని తెలిపారు. వారు పరీక్షల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్ఐఒ ఎన్ఎస్‌విఎల్.నరసింహం, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి.రవి, ఒకేషనల్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

కుటుంబం కలహాలనేపథ్యంలో నాగులాపల్లికి చెందిన ముడద భవాని (37) అదృశ్యం అయినట్లు సోమవారం కొత్తపల్లి పోలీసులు తెలిపారు. భవానికి మతి స్థిమితం లేక గత నెల 30వ తేదీన ఇంట్లో నుండి వెళ్లిపోయినట్లు కుటుంబం సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరావు తెలిపారు.

బైకు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-మండపేట

బైకు చోరీపై పట్టణ పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన మల్లేశ్వర ప్రసాద్ ఐడిఎఫ్సి బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 30న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మోటార్ సైకిల్ పార్క్ చేసి లోపలకు వెళ్లాడు. పని చూసుకుని తిరిగి వచ్చేసరికి బైకు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లభించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - మండపేట

అదనపు కట్నంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక బ్యాంక్ కాలనీకి చెందిన సిహెచ్.అరుణకుమారికి సామ్యూల్‌తో 2009లో వివాహమయ్యింది. వారికి ఇద్దరు సంతానం. కొంతకాలం వీరి దాంపత్య జీవితం సాఫీగానే సాగింది. ఇటీవల కాలంలో భర్త తాగి వచ్చి కొడుతున్నాడు. దీంతో పాటు అత్త సత్యవతి, భర్త అదనపు కట్నం కోసం హింసిస్తున్నారని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 5న సామ్యూల్ తీవ్రంగా కొట్టడంతో అరుణకుమారి గాయపడింది. ఆమె సోదరుడు వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత మృతి కేసులో జైలు

ప్రజాశక్తి - సీతానగరం

2018న కొండేపూడికి చెందిన వివాహిత గెడ్డం కళ్యాణి ఆత్మహత్యకు కారకులైన భర్త, కుటుంబికులకు సోమవారం కోర్టు జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. అప్పటి సీతానగరం ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు కళ్యాణి ఆత్మహత్యపై కేసు నమోదు చేయగా సిఐ ఆర్.జె. రవికుమార్ దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సోమవారం భర్త సోడదాసి పాల్ ఫ్రాన్సిస్‌కు ఏడేళ్ళు, సోడదాసి బేబీ, చెరుకూరి సరోజినికి రెండేళ్ల ఆరు నెలల జైలు శిక్ష విధించారు.

లారీని ఢీ కొన్న ట్రావెల్స్ బస్సు

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలో బందపురం జాతీయ రహదారిపై లారీని ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి మంగళగిరి బస్సు వెళ తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నారు. నలుగురికి స్వల్ప గాయాలు మినహా మిగిలిన ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికికి చెందిన జాస్తి బాబూరావు, ఇందిర దంపతులకు చెందిన ఇల్లు ప్రమాదాస్తు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మండపేట అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలు పక్క గహాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. సమాచారం అందుకున్న డిప్యూటీ తహాశీల్దార్ జానకి రాఘవ, విఆర్ఒ టి.సూర్యప్రకాశరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరామర్శించారు. ఆస్తి నష్టం రూ.3 లక్షలుగా ప్రాథమిక అంచనా వేశారు. మంటల్లో చిక్కుకున్న జాస్తి ఇందిరకు తీవ్ర గాయాలవడంతో ఆమెను స్థానికులు రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

బాధితులకు రూ.10 వేలు సాయం

నియోజక వర్గ జనసేన అధ్యక్షులు బండారు శ్రీనివాస్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులైన జాస్తి బాబురావు, ఇందిరా దంపతులకు ఓదార్చి, తక్షణ సాయాన్ని జనసేన నేత కొత్తపల్లి నగేష్‌తో కలిసి రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని అధికారులను కోరారు.

17లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు తప్పని సరిగా ఇకెవిఐసి, ఈక్రాప్‌ను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులతో ఆయన మాట్లాడారు. రైతులందరితో తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు చేయించుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు, పంటసాయం అందుతాయన్నారు. ఈ నెల 17 నాటికి పూర్తి స్థాయిలో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన వివరించారు. అనంతరం పలువురి రైతులతో ఆయన ఇకెవైసి చేయించారు.

విద్యారత్న ఉషారాణికి సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం పట్టణం స్థానిక ఎస్ వి డిగ్రీ కళాశాల నందు విద్యావేత్త తిమ్మరాజు ఉషారాణిని కళాశాల యాజమాన్యం,విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రమశిక్షణ గల వేలమంది విద్యార్థులను ఉషారాణి తయారు చేశారన్నారు. ఏడు పదుల వయసు దాటినా నేటికీ కోమరిగిరి పట్టణంలో ఉచిత విద్యను అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఅర్ఎన్.నరసింహారావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, యాలంగి వరప్రసాద్, కరాటం ప్రవీణ్, కె.శ్రావణ్ దిలీప్, మల్లిపూడి విజయలక్ష్మి, డాక్టర్ కె.హేమావిజిత, మల్లిపూడి రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన.. ఇలా..

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పెద్దాపురం నియోజకవర్గ పర్యటనకు ఎటువంటి ఇబ్బందులు లేవని, షెడ్యూల్ ప్రకారమే పర్యటన జరుగుతుందని కాకినాడ జిల్లా టిడిపి కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న గోకవరం మీదగా జగ్గంపేట రోడ్ షో, మధ్యాహ్నం సమావేశం అనం తరం ముఖ్య నాయకులతో సమావేశం, అదే రోజున జగ్గంపేటలో బస చేస్తారు. 16న మధ్యాహ్నం 03:00 గంటలకు పెద్దాపురం నియోజకవర్గం జె.తిమ్మాపురం గ్రామం వద్ద స్వాగతం కార్యక్రమం, మధ్యాహ్నం 03:30 గంటలకు పెద్దాపురం రూరల్ మండలం కట్టమూరు గ్రామ సెంటర్ వద్ద స్వాగత కార్యక్రమం, అక్కడ నుండి సాయంత్రం 05:00 గంటలకు పెద్దాపురం పట్టణం ఎన్.టి.ఆర్ సర్కిల్ వద్ద స్వాగతం కార్యక్రమం, తర్వాత దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్ మీదుగా పెద్దాపురం మెయిన్ రోడ్‌లో ఆంజనేయ స్వామి గుడి మీదుగా సామర్లకోట పట్టణం చేరుకోంటారు. సాయంత్రం 07:00 గంటలకు పెద్దాపురం మెయిన్ రోడ్ మీదుగా సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద సామర్లకోట పార్టీ శ్రేణులు స్వాగత ఏర్పాట్లు చేస్తారు. రాత్రి 08:30 గంటలకు సామర్లకోట మఠం సెంటర్, గడియారం సెంటర్, సామర్లకోట స్టేషన్ సెంటర్ మీదుగా సామర్లకోట చక్కెర ఫ్యాక్టరీ అతిథి గహానికి చేరుకుని రాత్రి బస చేస్తారు. 17 న ఉదయం సామర్లకోట నుంచి నేరుగా అనపర్తి మండలం చేరుకుని అక్కడ నిర్వహించనున్న పలు సమావేశాల్లో పాల్గొంటారని పార్టీ శ్రేణులు పర్యటన షెడ్యూల్‌లో తెలియజేశారు.

వృద్ధుల ట్రిబ్యునల్‌లో విచారణ చేస్తున్న ఆర్‌డిఒ సీతారామారావు

తల్లికి అనుకూలంగా వృద్ధుల సంఘం తీర్పు

ప్రజాశక్తి - పెద్దాపురం

కన్నతల్లి పోషణ పట్టించుకోని కుమారులు ఆమె తన పోషణ కోసం స్థలం అమ్ముకోకుండా అడ్డంకులు కల్పిస్తున్నారనే ఫిర్యాదుపై పెద్దాపురం డివిజన్ తల్లిదండ్రులు, వద్ధుల పోషణ సంక్షేమ సంఘం సోమవారం తల్లికి అనుకూలంగా స్థలం అమ్ముకునేలా తీర్పునిచ్చింది. పెద్దాపురం డివిజన్ శంఖవరం ఎస్‌సి కాలనీకి చెందిన పులి అప్పయ్యమ్మ(70) తన పోషణను తన కుమారులు అచ్చి రాజు, వీర వెంకట సత్యనారాయణ, వారి సంతతి పట్టించు కోవటం లేదని, తన పేరున ఉన్న నివేశన స్థలాన్ని పోషణ నిమిత్తం అమ్ముకోనివ్వడం లేదని తల్లిదండ్రులు, వద్ధుల పోషణ సంక్షేమ సంఘానికి ఫిర్యాదు చేసింది. దీనిపై సోమవారం ఆర్‌డిఒ జె సీతారామారావు, కౌన్సిలింగ్ అధికారి భళ్లమూడి సూర్యనారాయణమూర్తిలు విచారణ జరిపి కన్న తల్లికి అనుకూలంగా స్థలం అమ్ముకోనివ్వాలని తీర్పు చెప్పారు. దీనికి కుమారులు, వారి కుటుంబ సభ్యులు అంగీకరించారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ

సోమవారం కాకినాడ స్పందన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులు నలుగురికి జూనియర్ సహాయకులు గాను, ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్‌గాను మొత్తం ఆరుగురికి కలెక్టర్ కృతికా శుక్లా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్ అనుసరించి ఈ ఉద్యోగ పత్రాలను అందజేసినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఇలాక్కియా, డీఆర్ఓ కె శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ శ్రీనివాసురావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలో ఎం.చామవరం గ్రామంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిండుకుండల అప్పారావు, పెదపూడి వరలక్ష్మికి చెందిన తాటాకు ఇళ్లు రెండు దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలాన్ని తహాశీల్దార్ శివకుమార్ పరిశీలించి, సుమారు రూ. నాలుగు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించి ప్రభుత్వపరంగా బాధితులను ఆదుకుంటామని తహాశీల్దార్ శివకుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ అడపా సత్యవేణి పరామర్శించి తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులను అందజేశారు.

రబీకి యూరియా కొరత లేదు

- వ్యవసాయ శాఖ కమిషనరేట్ జెడిఎ కృపాదాస్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఈ రబీ సీజన్లో వరి సాగుకు ఇప్పటి వరకు ఎన్ ఎఫ్ సి ఎల్ పరిశ్రమ నుంచి 25,512 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి జరిగిందని, ఈ రబీ సీజన్‌కు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎటువంటి ఎరువుల కొరత లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ జెడిఎ (ఎరువుల విభాగం) కృపాదాస్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఎన్ ఎఫ్ సి ఎల్ ద్వారా రైల్వే రేక్ ద్వారా సరఫరా అవుతున్న ఎరువుల సరఫరాను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో రవి సీజన్ కు 1,88,362 ఎకరాలకు గాను 1,65,500 ఎకరాల్లో వరి పంట సాగు జరుగుతుందన్నారు. ఈ పంటకు 31 వేల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 21 240 మెట్రిక్ టన్నులు యూరియాను సరఫరా చేసామన్నారు. సామర్లకోట పరిసర ప్రాంత రైతులకు సామర్లకోట రైల్వే స్టేషన్లో ఒక రైల్వే రేక్ ద్వారా యూరియాను దిగుమతి చేస్తుండగా సామర్లకోట మండలానికి 1353 మెట్రిక్ టన్నులు, ద్వారపూడి పాయింటుకు స్పిక్ యూరియా 38 మెట్రిక్ టన్నులు, కోరమండల్ 900 మెట్రిక్ టన్నులు, ఆర్‌సిఎఫ్ 300 మెట్రిక్ టన్నులు, క్రిబ్‌కో 1390 మెట్టు టన్నులు వెరసి 4272 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అయినట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. ప్రస్తుత వరి పంట పిలకలు వేసే దశలో ఉన్నందున పంటకి వేయవలసిన యూరియా నిల్వలు పూర్తిగా సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 50శాతం ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. వాటిని పొందేందుకుగాను కాకినాడ పోర్టుకు సంబంధించి ఏడిఏ జీవి పద్మశ్రీని, సామర్లకోట రేక్ పాయింట్ సంబంధించి అధికారి ఇమ్మిడిశెట్టిని, ద్వారపూడి పాయింట్‌కు ద్వారపూడి ఎఒ పి, పవిత్రను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఆయన తెలిపారు. వీరు ఆయా డిస్ట్రిబ్యూటర్లను సంప్రదించి మానిటరింగ్ జరిపి యూరియాను సకాలంలో అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు చేపడుతు న్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సామర్లకోటలో దిగుమతి అవుతున్న ఎరువులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎఐవో సతీష్, ఎన్‌ఎఫ్‌సి ఎల్ రీజనల్ మేనేజరు రామ్మోహన్, ఎస్ఓ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఫోటోరైటప్:

ఇ-పంట నమోదు పరిశీలించిన జెడిఎల బృందం

ఇ- పంట నమోదు ప్రక్రియలో భాగంగా సోమవారం సూపర్ చెక్ రికార్డులు పరిశీలన కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం జెడిఎ ఎన్‌డివి కృపాదాసు, కాకినాడ జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌లు బృందం పాల్గొన్నారు. సోమవారం సామర్లకోట విత్తనోత్పత్తి అనుసరణీయ క్షేత్రం (విబిఆర్ఐ) వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి పరిశీలించారు. పంటలో ఎలుకల బెడద గమనించినట్టు చెప్పారు. వ్యవసాయ క్షేత్రంలో ఎలుకల నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కాకినాడ ఎడిఎ పద్మశ్రీ మాట్లాడుతూ అంచనాలతో కూడినఫార్మ్‌లో నీటి కాలువ డ్రెయిన్లు దెబ్బతిన్నాయని, అలాగే విత్తన ప్రాసెసింగ్ యూనిటు కూడా బాగు చేయాలని, దరఖాస్తు(నిధుల నిమిత్తం) కోరగా వాటి రిపేర్ల నిమిత్తం నిధులు విడుదల చేసేందుకు దరఖాస్తును పంపిస్తే కమిషనరు ఉత్తర్వులు మేరకు సిఫారసు చేస్తామన్నారు. సామర్లకోటలో 28 ఎకరాలలో ఉన్న ఈ విత్తన క్షేత్రంతో నాణ్యమైన విత్తనం రైతులకు అందుబాటు ఉంచామన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాన్ని ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి, కోనసీమలకు పంపిస్తున్నామని ఎడి పద్మ తెలిపారు. అత్యధిక రైతులు నాణ్యమైన విత్తనం అందుకుంటున్న పూరాతన క్షేత్రానికి కావలసిన నిర్మాణ మరమ్మతులకు తగిన నిధులు సమకూర్చే విధంగా కృషి చేస్తానని జెడిఎ కృపాదాస్ తెలిపారు. తదుపరి జిల్లా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ను సందర్శించి చిన్న చిన్నపనులు మినహా ల్యాబ్ పనులు పూర్తయ్యాయని జెడిఎ ప్రసాద్ వివరించారు

సామర్లకోట రైల్వే రేక్ పాయింట్ వద్ద యూరియా దిగుమతులు పరిశీలిస్తున్న జెడిఎ కృపాదాస్, అధికారులు

మద్దతు ధరకు పంట నమోదు తప్పనిసరి

పెద్దాపురం : రైతులు తమ పొలంలో పండించిన పంటలకు మద్దతు ధర లభించాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ ప్రత్యేక అధికారి వీడీవీ కృపారాజు అన్నారు. పెద్దాపురం మండలం తాటిపర్తిలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో పంట నమోదుపై సూపర్‌చెక్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాటాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా వారు పండించే పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల భవిష్యత్తులో పంటల కొనుగోలు,పంటకు మద్దతు ధర,ఇన్పుట్ సబ్సిడీ, పంట బీమా తదితర అన్నీ వర్తిస్తాయన్నారు.ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ ఉన్నారు. **జగ్గంపేట** స్థానిక వ్యవసాయశాఖ అధికారి రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం మర్రిపాక లో జెడిఎ కృపాదాస్ పంట నమోదును తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగడం ఆనందరావు పాల్గొన్నారు.

15 నుంచి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు

- ఏర్పాట్లు పూర్తి : రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 15వ తేదీ నుంచి జరగనున్న13వ హాకీ ఇండియా సీనియర్ మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ బీఎం చాణక్యరాజ్ తెలిపారు. సోమవారం ఛాంపియన్‌షిప్‌పై డీఎస్ఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చాణక్యరాజు మాట్లాడుతూ హాకీ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) మార్గనిర్దేశనంతో హాకీ కాకినాడ జిల్లా సహకారంతో హాకీ ఆంధ్రప్రదేశ్ ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. గత ఏడాది డీఎస్ఏ స్టేడియంలోనే హాకీ ఇండియా జూనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ ఏడాది సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ జి.హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 26 జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఎనిమిది పూల్స్‌లో పోటీలు జరగను న్నాయని.. 25వ తేదీన సెమీఫైనల్స్, 26న ఫైనల్ పోటీలు జరగనున్నట్లు వివరించారు. హాకీ ఇండియా నుంచి అంపైర్లు వస్తున్నారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే శిబిరాలకు ఎంపిక వుతారని వివరించారు. హాకీ ఆంధ్రప్రదేశ్ సలహాదారు ఎం.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 80 ఏళ్ల హాకీ చరిత్రలో ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి ఈ మెగా ఈవెంట్ జరుగుతుందన్నారు. ఆస్ట్రోటర్ఫ్ హాకీ మైదానంలో జరిగే ఈ ఈవెంట్‌ను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో కృషిచేయాలని కోరారు. హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, ఈవెంట్ సమన్వయకర్త వి.రవిరాజు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన హాకీ ఇండియా సీనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహిం చేందుకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన 17 సమన్వయ శాఖల సమావేశం జరిగినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, కాకినాడ నగరపాలక సంస్థ తదితర విభాగాలు సహకరించనున్నట్లు వెల్లడించారు. నగరపాలక సంస్థ దాదాపు మూడు లక్షల ఖర్చుతో లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు ప్రమాణాలకు అనుగుణంగా భోజన, వసతి ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హాకీ ఆంధ్రప్రదేశ్ కోశాధికారి పి.థామస్ పీటర్, డీఎస్ఏ చీఫ్ కోచ్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హాకీ పోటీల ఏర్పాట్ల వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

ఆదిత్యలో ఐఇటిఇ స్టూడెంట్ ఫోరమ్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ స్టూడెంట్ ఫోరమ్ ప్రారంభమైంది. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా జెఎన్‌టియుకె ప్రొఫెసర్, ప్రస్తుత ఐఇటిఇ కాకినాడ సెంటర్ చైర్మన్ డాక్టర్ బిటి కృష్ణ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో స్థాపించే ఐఇటిఇ స్టూడెంట్ ఫోరమ్ కాకినాడ సెంటర్ అనుబంధ సంస్థలుగా ఉంటాయన్నారు. స్టూడెంట్ ఫోరమ్ ద్వారా ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఇంజనీరింగ్ తర్వాత ఉద్యోగం చేసుకుంటూ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ జి సురేష్ మాట్లాడుతూ ఐఈటీఈ స్టూడెంట్ ఫోరమ్ ద్వారా ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉండే వినూత్న అంశాలపై సదస్సులు నిర్వహించటం, ఆయా రంగాలలో విశిష్ట కృషి చేసే వ్యక్తులను ఆహ్వానిం చటం ద్వారా విజ్ఞాన సముపార్జనకి అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఈసీఈ విభాగ అధిపతి డాక్టర్ రాధ మాట్లాడుతూ 310 మంది విద్యార్థులు ప్రస్తుతం ఐఇటిఇ స్టూడెంట్ ఫోరమ్ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఐఇటిఇ న్యూ ఢిల్లీ, కాకినాడ సెంటర్ సంయుక్త అధ్వర్యంలో ఐఈటీఈ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించి వివిధ సాంకేతిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరిగే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథి డాక్టర్ బి.టి.కృష్ణను ఆదిత్య విద్యాసంస్థల తరుపున దుశ్శాలువా, జ్ఞాపిక అందజేసి సత్కారించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులకు విభాగ అధిపతి వెల్ల సత్య నారాయణ ధన్యవాదాలు తెలియ జేశారు. అధ్యాపకులు డాక్టర్ గమిని శ్రీదేవి, అమరాడి కొండబాబు, టి శ్రీనివాస రావు, వై యామిని దేవి, పి బుజ్జిబాబు, ఐఈటీఈ కోఆర్డినేటర్ ఎస్ జగదీశ్, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్యలో స్టూడెంట్ ఫోరమ్ ప్రారంభిస్తున్న ఐఇటిఇ చైర్మన్ కృష్ణ, ప్రిన్సిపాల్‌లు

మట్టి సరఫరాదారులతో సిఐ సమావేశం

ప్రజాశక్తి-కడియం

నర్సరీలకు మట్టి సరఫరాచేసేవారితో కడియం సిఐ తిలక్ సోమవారం సమావేశం నిర్వహించారు. కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. కడియం మండలంలో విస్తారంగా ఉన్న నర్సరీలకు ఎర్ర మట్టి, నల్ల మట్టి అవసరం ఎంతో ఉందని, దానిని ఆసరాగా తీసుకుని అధిక ట్రిప్పుల కోసం సప్లయర్స్, డ్రైవర్లు మితిమీరి వాహనాలు నడిపితే సహించేది లేదని చెప్పారు. ప్రధాన కూడళ్లలో, ట్రాఫిక్ ఉన్నచోట, గృహ సముదాయాల మధ్య లారీలు నెమ్మదిగా వెళ్లాలని, అనుభవం లేని డ్రైవర్లను నియమించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, కొత్తపల్లి శివాజీ, బొర్సు సుబ్బారాయుడు, చెక్కపల్లి పోలరాజు, సింగంశెట్టి శ్రీను, ఆకుల గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న రోడ్లు.. ప్రయాణికుల పాట్లు..

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో పలు రోడ్లు కుంగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. మడికి-దుళ్ల కాలువ గట్టు రోడ్డు, మోదుకూరు-గుమ్మిలేరు రోడ్డులో ఎల్-టర్నింగ్ వద్ద ఆర్ అండ్ బి రోడ్లు కుంగి పోయాయి. రోడ్డులో సగభాగం కుంగిపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఒకవైపునకు ఒరిగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. రోడ్డు పక్కనే పంటకాలువలు, బోదెలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మడికి-దుళ్ల రోడ్డులో కుంగిన రహదారి

చంద్రబాబు పర్యటన విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 15, 16, 17 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయాలని సమన్వయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మెయిన్ రోడ్డులోని హోటల్ జగదీశ్వరిలో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, నగర టిడిపి అధ్యక్షులు రెడ్డి మణి తదితరులు మాట్లాడారు. పర్యటనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో దొండపాటి సత్యంబాబు, రెడ్డి రాజు, ద్వారా పార్వతి సుందరి, షేక్ సుభాన్, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, ఈతలపాటి కృష్ణ, ఛాన్ బాషా, బుడ్డిగ రాధాకష్ణ, ఇన్నమూరి రాంబాబు, నల్లం శ్రీను, నిమ్మలపూడి గోవింద్, కంటిపూడి శ్రీనివాస్, మరుకుర్తి రవి యాదవ్ పాల్గొన్నారు.

చెట్లతొలగింపుపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ పరిధిలో హైవే పక్కన 5 ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ హైవే స్థలం ఉంది. హైవేకి సంబంధించిన నిర్మాణ పనుల్లో ఈ భూమిని ఉపయోగించుకుంటూ ఉండేవారు. కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉండడంతో గ్రామంలో కొంతమంది ఆ స్థలంలో భారీ వృక్షాలను తొలగించి వాటిని విక్రయించుకున్నారు. దీనిపై మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి, గంటా మనోహర్‌దాస్ తదితరులు సచివాలయం, నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైవే ప్రాజెక్టు మేనేజర్ బాలసుబ్రమణ్యం స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాని సంబంధితి ఈతకోట హైవే టోల్ ప్లాజా మేనేజర్ నేహెమ్యాను ఆదేశించారు. దీంతో సోమవారం ఆయన సోమవారం ఈ స్థలాన్ని పరిశీలించారు. వృక్షాలు తొలగింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట రోడ్ సేఫ్టీ మేనేజర్ విజయ్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P. 39/2015 in O.S. 80/2012

Between:

కేసిబోయిన నాగమణి ...డిక్రీహోల్డర్

మరియు

కేసిబోయిన సూర్యారావు ...జడ్జిమెంట్‌డెట్టార్

పై నెంబరు కేసులో జె.డి.ఆర్. నుండి డిక్రీహోల్డర్‌కు రావలసిన బాకీగాను జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 17-02-2023వ తేదీన ఉదయం గం. 10-30 ని॥ల** నుండి యిస్తిహారు షరతులకు లోబడి పై కోర్టువారి ఎదుట వేలం వేయబడును. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవరైనా పాడదలచినవారు **ది. 17-02-2023వ తేదీ ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరు కావలెను.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుత కాకినాడ జిల్లా), పిఠాపురం సబ్-రిజిష్ట్రీ, యు.కొత్తపల్లి మండలం, కొమ్మరగిరి గ్రామం, సర్వే నెం. 217లో పూరా విస్తీర్ణం య. 1-96½ సెంట్లు భూమిలో ఉత్తరంవైపు **య. 1-46½ సెంట్లు భూమికి హద్దులు: తూర్పు:** రామయ్య గారి చెరువు; **దక్షిణం:** కేసిబోయిన బాపనమ్మ గారి భూమి; **పడమర:** పిల్లి అర్జున మరియు పిల్లి ధర్మరాజు గారి భూమి; **ఉత్తరం:** రావు రాంబాబు గారి భూమి.

పై హద్దుల మధ్యగల య. 1-46½ సెంట్లు భూమి సమస్త యాజిమెంటు మొదలగు హక్కులతో వేలం వేయబడును.

డిక్రీహోల్డర్ విలువ : రూ. 2,00,000/-
అమీనా విలువ : రూ. 10,25,500/-
మార్కెట్ విలువ : రూ. 16,11,500/-
(As per M.V.C. of S.R.O, Pithapuram)

పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
పిఠాపురం. డో.నెం. 4-2-133, కుచివారి వీధి,
ది.13-2-2023 పిఠాపురం. సెల్: 9848006149

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 148/2022

బిట్వీన్:

అల్లం @ బిట్రా నాగసాయి ...పిటీషనర్

మరియు

అల్లం పద్దరాజు ...ప్రతివాది

టు: అల్లం పద్దరాజు, తండ్రి: రాములు, డో.నెం. 4-7, వడిసిలేరు గ్రామం, రంగంపేట మండలం, తూ॥గో॥జిల్లా, పిన్: 533294.

పై నెంబరు పిటీషనులో ప్రతివాదికి నోటీసులు పంపగా ప్రతివాది పిటీషను సంగతులు తెలిసియుండి నోటీసులు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substitutional Service ద్వారా అమలు జరుపుటకు గాను **ది.09-03-2023 వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పై పిటీషను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

తోట జగదీష్ కుమార్
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
13-2-2023. సెల్: 80960 26627

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి పిఠాపురం వారి కోర్టులో

I.A. 185/2022 and I.A. 186/2022 and I.A. 187/2022 in O.S. 244/2017

Between:

దేవవరపు మంగ అండ్ అదర్స్...పిటీషనర్స్ / వాదులు

మరియు

పడాల నూకరాజు (Died) అండ్ అదర్స్

...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

టు: రెస్పాండెంట్లు :

R6: పడాల మంగ, W/o. నూకరాజు, హిందూ, వయస్సు 60 సం॥లు, గృహిణి, R/o. డో.నెం. 5-17, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా. పిఠాపురం JCJC Limits.

R7: పడాల బాపిరాజు, S/o. నూకరాజు, హిందూ, వయస్సు 39 సం॥లు, వ్యవసాయం, R/o. డో.నెం. 5-17, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా, పిఠాపురం JCJC Limits.

నోటీసు

పై నెంబరు గల దావాలో 1వ ప్రతివాది అయిన పడాల నూకరాజు గారి వారసులుగా మిమ్ములను చేర్చమని దాఖలు చేసిన పిటీషన్‌లలో మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు గల పిటీషన్‌లు **ది. 23-02-2023వ** తేదీన వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై పిటీషన్‌లు మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీచేయబడిన నోటీసు ||

పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
పిఠాపురం. డో.నెం. 4-2-133, కుచివారి వీధి,
ది.13-2-2023 పిఠాపురం. సెల్: 9848006149

నగరపంచాయతీ కార్యాలయం-ఏలేశ్వరం

ఆర్.ఒ.సి.నెం. 19/2023/ఎ1 తేది. 13-02-2023

బహిరంగ వేలము నోటీసు

ఏలేశ్వరం నగరపంచాయతికి సబంధించిన రోజువారి మార్కెట్, వారపుసంత, కబేళ ఫీజులు వసూలు చేసికొను హక్కునకు తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు అనగా ఒక సంవత్సరం కాలం గుత్తకు ఇచ్చుటకు తేదీ: 21-02-2023 మంగళవారం ఉదయం 11:00 గంటలకు ఏలేశ్వరం నగర పంచాయతి ఆవరణములో కమీషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వేరొక అధికారిచే గాని నరగ పంచాయతి కార్యాలయంనందు బహిరంగ వేలమును నిర్వహించబడును. వేలములో పొల్గొనువారు ఈ దిగువ తెలిపిన విధంగా ధరావత్తు మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్లు కార్యాలయమునకు సమర్పించవలెను.

వ.నెం.	లీజుకు ఇవ్వబడు మార్కెట్టు వివరములు	డిపాజిట్టు క్రింద చెల్లించవలసిన మొత్తం(రూ)	సమర్పించవలసిన సర్టిఫికెట్టు మొత్తం పరిధి (రూ)
1.	రోజువారి మార్కెట్, వారపు సంతకు	50,000/-	6,00,000/-
2.	మాంసపు మార్కెట్ (కబేళ)	25,000/-	3,00,000/-

సం/- **కమీషనరు**, ఏలేశ్వరం నగరపంచాయతి

IN THE HONOURABLE COURT OF M.A.CT/DISTRICT JUDGE, AT VIZIANAGARAM
M.O.P.372/2022

Between:
B.V.S.S.Jagannadha Raju & another .....Petitioners
And
Mandala Durga Prasad & others .....Respondents

NOTICE

Respondent No.1
Kundeti Hanuma Vara Prasad,
S/o Rama Krishna, Lorry driver,
D.No.2-210, Burrilanka,
Kadiyapulanka,
East Godavari District.

Take notice that the above petition filed by the petitioners against you and others claiming compensation for the death of their son B.Naren Varma in a motor vehicle accident is posted to **24.02.2023** for your appearance. You are hereby directed to appear before the above court on the above date by **10.30 A.M.** either in person or through an advocate failing which the matter will be heard in exparte.

K.R. DASARADHI
Advocate for the Petitioner
VIZIANAGARAM
Ph: 9440348656